క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాలభైరవాష్టమి



విశేష అలంకారంలో శ్రీ కాలభైరవస్వామి

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాల, కాలభైరవపురం గ్రామంలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో కాలాభైరవాష్టమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీధరశర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం , అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. భక్తులు సామూహికంగా కాలభైరవ అష్టకాన్ని పఠించారు. ఆలయ ధర్మకర్త మేరువ బాలాజీరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: స్కీం వర్కర్ల సమస్యల కోసం చేపడుతున్న పోరాటాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్న ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపడం సరికాదన్నారు. వీరిని పాలక ప్రభుత్వాలు పర్మినెంట్ చేసి కనీస వేతనాలను చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

కడప అర్బన్: హోంగార్డు వై. శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ నేపథ్యంలో ఆయన తనయుడు వై. వెంకటేష్‌కు కారుణ్య నియామకం కింద హోంగార్డుగా నియమించారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, దివంగత హోంగార్డు సతీమణి, వై. రమాదేవి పాల్గొన్నారు.

17న వైవీయూలో కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, మొల్ల సాహితీపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17న కవయిత్రి మొల్ల సప్తశత జయంతి సభ నిర్వహించనున్నట్లు వైవీయూ తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి తెలిపారు. వైవీయూలోని ఆర్ట్స్‌బ్లాక్ సెమినార్ హాల్లో నిర్వహించే ఈ సభకు వీసీ ఆచార్య జింక రంగ జనార్దన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య తదితరులు హాజరవుతారన్నారు.

కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా జనార్దన్



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.జనార్దన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మార్లె యానాదయ్య భారతి సిమెంటు ఫ్యాక్టరీ గూడ్స్ సూపర్‌వైజర్‌గా బదిలీ అయ్యారు. 2018లో ఆర్‌ఆర్‌బీ ద్వారా ఎంపికైన జనార్దన్ ముద్దనూరు రైల్వేస్టేషన్‌లో కమర్షియల్ సూపర్‌వైజర్‌గా పనిచేశారు. ఆ తర్వాత పదోన్నతిపై కడప కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ఉండాలి

పెండ్లిమర్రి : పంటలు సాగు చేసే రైతులు నవధాన్యాల సాగుపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారిని బ్లెస్సీ అన్నారు. మండలంలోని నాగాయపల్లె గ్రామంలో బుధవారం నవధాన్యాల సాగుపై రైతులకు ఆమె అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు వృద్ధి చెంది సాగు చేసే పంటకు మంచి పోషకాలు అందుతాయన్నారు. ఒక ఎకరాకు 13 కేజీలు విత్తనాలు చల్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమల్లేశ్, ఏఈఓ గంగాధర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

కమలాపురం : ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. బుధవారం ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు పరీక్ష కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య అధికారులు నిర్వహించారు. పట్టణంలోని గురుకుల పాఠశాల, పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. గురుకుల కేంద్రంలో 253 మంది విద్యార్థులకు గాను 239 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిటెండెంట్ తుల శమ్మ, డిపార్ట్‌మెంట్ అధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. అలాగే పీవీఎస్ఆర్ కళాశాల కేంద్రంలో 223 మందికి 211 మంది హాజరయ్యారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

స్టెప్ సీఈఓ సాయిగ్రేస్



విజేతలకు మెడల్స్ అందజేసిన అతిథులు

వైవీయూ: వినియోగదారులు తమకు ఉన్న హక్కుల, రక్షణ చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ సూచించారు. బుధవారం స్టెప్ ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని అలంఖాన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఈఓ మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే వస్తువులను కొనుగోలు చేసే సమయంలో ఏవైనా లోటుపాట్లు కనిపిస్తే ఆ వస్తువును లేదా సేవను అందించిన సంస్థను ప్రశ్నించే హక్కు వినియోగదారులకు ఉంటుందని తెలిపారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.వి. రమేష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఎస్. ఫర్హతుల్లా మాట్లాడారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి. నిత్యప్రభాకర్, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది నారాయణ, నాగయ్య, సుబ్బారావు, అబ్బాస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, కోచ్‌లు పాల్గొన్నారు.

వినియోగదారులు చట్టాలను తెలుసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు మురళీకృష్ణ

కడప సిటీ : వినియోగదారులు చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రపంచ వినియోగదారుల దినోత్సవ సభ వీసీ హాలులో జరిగింది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖ, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకుని వ్యాపారంలో జరుగుతున్న మోసాలను అరికట్టాలన్నారు. పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి సుబ్బారెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ అర్జున్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, రాష్ట్ర వినియోగదారుల ఫోరం కన్వీనర్ తిరుపాల్, జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్, సలహాదారు సీపీ రమేష్, వినియోగదారుల హక్కుల ఫోరం ప్రతినిధి ఓబులేశు మాట్లాడారు. ఈ సందర్భంగా వినియోగదారుల అవగాహన కోసం వీసీహాలు ప్రాంగణంలో తూనికలు, కొలతలశాఖఅధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు.

కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం



ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మధుసూదన్‌రావు



పోలింగ్ నిర్వహణ దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో బుధవారం జరిగిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా జి.మధుసూదన్‌రావు 144 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. బుధవారం జరిగిన ఈ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ మొత్తం 250 మందికిగాను 230 ఓట్లు పోలయ్యాయన్నారు. ఎన్నికల బరిలో మజ్దూర్ యూనియన్ ప్యానల్‌లోని తొమ్మిది మంది ఘన విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీగా ఎస్‌డీఎన్ సంజీత్, ట్రెజరర్‌గా వెంకట సుబ్బయ్య, కమిటీ మెంబర్లుగా అనిల్‌కుమార్, గీతా, వీణా, అమృత, రాజేష్‌కుమార్, మణికంఠ, మస్తాన్ గెలుపొందారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం శాయాశక్తుల కృషి చేస్తామని మధుసూదన్ రావ్ తెలిపారు. ఈ ఎన్నిక రైల్వే అసిస్టెంట్ డివిజనల్ అధికారి రాధాకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. రైల్వే పోలీసు ఎస్ఐ రారాజు, సీకే దిన్నె ఎస్ఐ అరుణ్‌కుమార్, రైల్వే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం గెలుపొందిన వారు స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు.

నిధుల వినియోగంపై అవగాహన అవసరం

వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్.వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. వెంకట్రామిరెడ్డి

వైవీయూ: జాతీయ సేవాపథకం నిధుల వినియోగంపై ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన అవసరమని వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లకు పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ నిధులన్నీ ఆన్‌లైన్ విధానంలో ఖర్చుచేయాలని సూచించారు. విజయవాడ జాతీయ సేవాపథకం రాష్ట్ర కార్యాలయ రీసోర్స్ పర్సన్ దూపూడి మనోహరి, పి. శివకాంత్‌లు పబ్లిక్ ఫైనాన్స్ సెల్ మేనేజ్‌మెంట్ సిస్టం గురించి పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని కళాశాలల ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

18 నుంచి షహమీరియా దర్గా ఉరుసు



హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ హఖ్ ఉరఫ్ షహమీర్‌బాష చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ దర్గా ప్రాంగణం

కడప కల్చరల్ : స్థానిక రవీంద్రనగర్‌లోని ఆస్తానే షహమీరియా దర్గా ఉరుసు ఉత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆస్తానే షహమీరియా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా హుసేనీబాషా షహమీరి తెలిపారు. షహమీరియా దర్గాలోని హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అబ్దుల్ హఖ్ ఉరఫ్ షహమీర్‌బాషా చిష్టివుల్ ఖాద్రీ సాహెబ్ పేరిట ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శనివారం సాయంత్రం అసర్ నమాజ్ అనంతరం గంధం ఉత్సవం నిర్వహిస్తామని, అనంతరం నాతియా మెహఫిల్, అన్నదాన కార్యక్రమం ఉంటాయని తెలిపారు. 19న సెమినార్ కార్యక్రమం వైట్‌హౌస్ ఫంక్షన్ హాలులో ఉంటుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు ఉర్దూ యూనివర్శిటీ మాజీ వీసీ మౌలాన రాహిఫిదాయి, ప్రొఫెసర్ ముజఫర్ షహమీరి, హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఫజులుల్లా ముకరమ్, తిరుపతి ఎస్వీయూ ప్రొఫెసర్ సత్తార్ సాహిర్, ప్రొఫెసర్ నిస్సార్ అహ్మద్ పాల్గొంటారని తెలిపారు.

సహకార బ్యాంకులతో రైతులకు విశిష్ట సేవలు



రైతులతో మాట్లాడుతున్న అప్కాబ్ రాష్ట్ర చైర్మన్ మల్లెల ఝాన్సీ రాణి

చింతకొమ్మదిన్నె : వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మెరుగైన విశిష్ట సేవలు అందుబాటులోకి వచ్చాయని అప్కాబ్ రాష్ట్ర చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి అన్నారు. బుధవారం చింతకొమ్మదిన్నెలోని సహకార బ్యాంకులో రైతులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కావాల్సిన అన్ని సదుపాయాలను అందిస్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు బంగారుపై రుణాలను అందించేందుకు వ్యవసాయ కేంద్ర బ్యాంకు ముందుకు వచ్చిందన్నారు. గరిష్టంగా రైతుకు రూ. 5లక్షల వరకు ఎలాంటి చార్జీలు లేకుండా రుణాలను అందించనున్నామన్నారు. అనంతరం వ్యవసాయ కేంద్ర బ్యాంకులో బంగారును ఉంచుకునేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ఆమె ప్రారంభించారు.కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు సీఈవో రాజేంద్ర కుమార్, నాబార్డు డీడీఎం విజ విహారి, డీసీసీ బ్యాంకు అడ్వయిజర్ సహదేవ రెడ్డి, పిఎసీఎస్ డెవలప్‌మెంట్ ఏజీఎం వీర శంకర్, డైరెక్టర్లు విశ్వనాథరెడ్డి, సుబ్బరామిరెడ్డి, సికెదిన్నె, నాగిరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షులు శ్రీరామిరెడ్డి, రాజారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు




గాయపడిన నాగం నారాయణరెడ్డి, పసుపులేటి శ్రీనివాస్

అట్లూరు: మండల పరిధిలోని గంగానగర్ సమీపంలో మంగళవారం రాత్రి ఆటో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు బద్వేలు మున్సిపాలిటీ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న నాగం నారాయణరెడ్డి, పసుపులేటి శ్రీనివాస్ కడపకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. పనులు ముగించుకుని బద్వేలుకు వస్తుండగా గంగానగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో నాగం నారాయణరెడ్డి, పసుపులేటి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు.

డీజిల్ నిల్వలపై పోలీసుల దాడులు

ప్రొద్దుటూరు క్రైం : అనుమతి లేని డీజిల్ నిల్వలపై కడప ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు.

ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని ఆటోనగర్‌లో పలువురు వాహనదారులు అనుమతి లేకుండా కర్నాటక డీజిల్‌ను నిల్వ చేశారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నాలుగు చోట్ల డీజిల్ నిల్వ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిల్వ చేసిన డీజల్ కర్నాటకు చెందినదిగా ప్రాథమికంగా నిర్ధారించారు. డీజిల్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ నమోదును వేగవంతం చేయండి

చాపాడు : మండలవ్యాప్తంగా జరుగుతున్న ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 85శాతం పూర్తయిందని, మిగిలిన నమోదును మండలంలోని 15 గ్రామ సచివాలయల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు గ్రామ వలంటీర్ల చేత చేయించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఆయుష్మాన్ భారత్ నమోదు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : స్థానిక అమ్మ నాన్న మదర్ థెరిసా వద్ధాశ్రమంలో దేవశెట్టి వెంకటమ్మ (73) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. వృద్ధాశ్రమం నిర్వాహకుడు వై.హిదాయత్ ఆమె అంత్యక్రియలను నిర్వహించాలని మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావును సంప్రదించారు. ఫౌండేషన్ వారు బుధవారం వెంకటమ్మ మృతదేహానికి హిందూ శ్మశాన వాటికలో సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు, ప్రెసిడెంట్ కామనూరు శివసాయినాథ్, సుభాన్, సుబ్బయ్య, గౌస్, కానిస్టేబుల్ భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరామ్ జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధి కొత్తపల్లె పంచాయతీ వివేకానంద కాలనీలో బుధవారం బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం జయంతి వేడుకలను తులసి సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీఎస్పీని స్థాపించి చేసిన సేవను తులసి సేవాసంఘం అధ్యక్షురాలు మల్లెపూల తులసి వివరించారు. బీఎస్పీ పట్టణాధ్యక్షుడు నారాయణ, గంగరాజు, కావ్య, సుబ్బరాయుడు, అనురాధ, వెంకటరామయ్య, సుబ్బయ్య, రాజు, దేవి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

అట్లూరు : అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వలీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అలాగే కొండూరు, సోమేశ్వరపురం డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లలో జరుగుతున్న హెల్త్ మేళా కార్యక్రమాన్ని సందర్శించి అక్కడ ఉన్న పిల్లలకు, గర్భిణులకు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఓ వి.జార్జి, డీఎస్ఓ హరి, వైద్యాధికారి డాక్టర్ కె.హమీదాబేగం, సీహెచ్ఓ సి.మురళీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు భేష్

లింగాల : 2021-22 ఆర్థిక సంవత్సరంలో లింగాల మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులు బేష్ అని ఉపాధి హామీ అడిషనల్ పీడీ శివప్రసాద్ కితాబునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఆయన ఓపెన్ ఫోరం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని రూ.8.27 కోట్లతో ఉపాధి హామీ పనులు జరిగాయని అందులో కూలీల వేతనాల కింద రూ.7.33 కోట్లు, మెటీరియల్ పేమెంట్ కింద రూ.94 లక్షలు వెచ్చించడం జరిగిందన్నారు. దీనిపై సామాజిక తనిఖీ బృందం పనులను పరిశీలించిందన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులు లేకుండా ఓపెన్ ఫోరం నిర్వహించామన్నారు.

మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలి



మార్నింగ్ విజిట్‌లో భాగంగా మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 8వ డివిజన్ శంకరాపురంలో ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్లో భాగంగా ఆయన శంకరాపురంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. గార్బేజ్ పాయింట్లు ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి కాలం సమీపించినందున ప్రతి కార్మికుడు వాటర్ బాటిల్ హెడ్ క్యాప్ ధరించాలన్నారు. చెత్తను స్వీకరించే బండ్లు వస్తున్నాయా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. క్లాప్ ద్వారా చేసిన కలెక్షన్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న భవనాలకు సంబంధించి రోడ్లపై వేస్తున్న మెటీరియల్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్దన్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ విభాగం సామాజిక కార్యకర్త బి.వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం నగర శివార్లలోని రిమ్స్ ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సింగ్ కళాశాల విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, బాలల న్యాయ చట్టం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ చట్టం గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాల బాలికలకు ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. బేటీ బచావో-బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలి రోజు పరీక్షలు ప్రశాంతం

22 పరీక్షా కేంద్రాలకుగాను 6640 మంది హాజరు



పరీక్షా కేంద్రం వద్ద వేచిఉన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు కడప మండలంలో ప్రశాంతంగా జరిగాయి. నగరవ్యాప్తంగా సంబంధిత పరీక్షల కోసం 22 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో జనరల్‌కు సంబంధించి 6020 మంది విద్యార్థులకుగాను 5912 మంది హాజరయ్యారు. అలాగే ఒకేషన్‌కు సంబంధించి 764 మందికిగాను 728 మంది హాజరయ్యారు. ఇలా మొత్తంగా జనరల్, ఒకేషన్‌కు సంబంధించి 6784 మందికిగాను 144 మంది గైర్హాజరయ్యారు కడపలోని పలు పరీక్షా కేంద్రాలను ఆర్ఐవో రమణరాజుతోపాటు స్క్వాడ్ సభ్యులు తనిఖీలు చేశారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి జార్జి

బద్వేలు అర్బన్ : ప్రభుత్వాసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి వి.జార్జి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణుల వివరాలు, ఆరోగ్య సమస్యలు వంటివి తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఓపీ తీసుకున్న బాధితుల వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రికార్డులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప గణాంక అధికారి హరి, వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది విజయమ్మ, ఆనంద్, మురళి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స్నస్వర్ణలత పేర్కొన్నారు. బుధవారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో తొట్టిగారిపల్లె, బి.కోడూరు సీహెచ్‌ఓలకు, వైద్య సిబ్బందితో యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా ట్రైనర్ శుభలేఖ, సూపర్‌వైజర్ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 400 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకులాల పేదలకు 400 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దండు వీరయ్య మాదిగ మాట్లాడుతూ వ్యవసాయ కూలీలందరికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా కల్పించాలన్నారు. మద్యపాన నిషేధం అమలు చేస్తే పేదల కుటుంబాలు బాగుపడుతాయన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరు నెలలకోమారు రూ.3వేలు చొప్పున పోషణకు ఇవ్వాలని కోరారు. ఈనెల 18న చలో నంద్యాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు కె.నాగభూషణం మాదిగ, ఎస్.బాలలక్షుమయ్య పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు అఫ్జల్ ఖాన్, అహ్మద్‌బాషా, సుహైల్

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవలందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ బజాజ్ ఎండీ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. కడప నగరంలోని ఇబ్రహీం ఖలీలుల్లా మసీద్ సమీపంలోని బిలాల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, హెచ్‌బీ మోడల్‌స్కూల్లో బుధవారం సైన్సుఫేర్‌ను నిర్వహించారు.ఈ సైన్సుఫేర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహేల్, వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా, నగర అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

వార్డు వలంటీర్‌పై దాడి

ప్రొద్దుటూరు క్రైం: కేహెచ్ఎం స్ట్రీట్‌లోని 13వ వార్డు సచివాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ సుభాన్‌పై అతని బంధువులు దాడి చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. సుందరాచార్యుల వీధిలో నివాసం ఉంటున్న సుభాన్‌కు ఇస్లాంపురం వీధికి చెందిన యాస్మిన్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య కొద్దిపాటి గొడవలుండేవి. పది రోజుల క్రితం యాస్మిన్ గొడవ పడటంతో భర్త సుభాన్ ఇంటికి వెళ్లడం లేదు. సుభాన్ బుధవారం సచివాలయంలో ఉండగా అతని బామ్మర్ది మహమ్మద్‌తో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి అతనిపై దాడి చేశారు. ఈ సంఘటనలో గాయపడిన అతన్ని సచివాలయ ఉద్యోగులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.